క్లుప్తంగా

27న 'జగనన్నకు చెబుదాం'

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఏవైనా సమస్యల పరిష్కారానికి అర్జీలు(దరఖాస్తులు) సమర్పించుకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా తమ శాఖలకు సంబంధించి, పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

కోటదుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు


ఆలయ అధికారుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు

పాలకొండ: స్థానిక కోటదుర్గమ్మ ఆలయ హుండీలో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి, లెక్కించగా, మొత్తం 43 రోజులకు గాను రూ.5,44,753 వచ్చినట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటరమణ, ఆలయ ప్రధానార్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్ క్లీనింగ్ కిట్ల పంపిణీ

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో 95 ప్రభుత్వ పాఠశాలలకు బాత్‌రూమ్ క్లీనింగ్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. అందజేసిన వాటిలో బాత్‌రూమ్, టాయిలెట్ క్లీనర్లు, ఎయిర్ ఫ్రెషనర్, బ్రష్‌లు, చేతిగ్లౌజ్‌లు ఉండగా, వీటి వివరాలను రికార్డుల్లో పొందుపరిచి, అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు చూపించాలని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ మనోజ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


108 వాహనంలో చికిత్స పొందుతున్న అందవరపు శ్రీనివాసరావు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో చిట్టపులివలస జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరఘట్టానికి చెందిన అందవరపు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. వీరఘట్టం నుంచి ఆయన స్కూటీపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే స్కూటీ అదుపు తప్పి ప్రమాదం జరిగిందా? ఏదైనా వాహనం ఢీకొట్టడంతో జరిగిందా అనే విషయం తెలియరాలేదు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: అంగన్‌వాడీల(అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు) సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఇదే విషయమై సోమవారం స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో మానవహారం చేపట్టిన ఆయన అంగన్‌వాడీలకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ప్రధాన రోడ్డులో ర్యాలీ నిర్వహించి, తమ హక్కులపై అంగన్‌వాడీలు నినదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి, కె.రాము, వీరన్నాయుడు, టి.నిర్మల, ఎస్.మణి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


గోపాలపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్యారోగ్య సిబ్బంది

పాలకొండ: మండలంలోని గోపాలపురం, సింగన్నవలస, కొండాపురం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. సోమవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బంది రోగుల వివరాలు సేకరించి, వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. వీరందరికీ ఈ నెల 30వ తేదీ నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్యసేవలు అందిస్తారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు.


పాలకొండ రూరల్: భక్తుల పూజలందుకుంటున్న గణపయ్య


పాలకొండ రూరల్: యాలాం జంక్షన్‌లో కొలువైన గణేశునికి పూజలు చేస్తున్న భక్తులు


భామిని: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక సందడి

గణపతి నవరాత్రి ఉత్సవాలతో అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సోమవారం ఉదయం పూజలు, మధ్యాహ్నం అన్నదానాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓం గణేశాయనమః, ఓం ఏకదంతాయనమః పార్వతీ తనయా పాహిమాం నినాదాలతో మండపాలు మార్మోగాయి. కొన్నిచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలు ఎంతో అట్టహాసంగా జరిగాయి. విగ్రహ ఊరేగింపులో డీజే పాటలకు యువతీ,యువకులు చేసిన నృత్య ప్రదర్శనలు, అమ్మవార్ల వేషధారణలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. –సాక్షి నెట్‌వర్క్.


పాలకొండ రూరల్: సింగన్నవలసలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు


పాలకొండ రూరల్: నీలమ్మకాలనీలో జరిగిన వేలంలో దక్కించుకున్న లడ్డూతో భక్తులు


పాలకొండ: ఆంజనేయనగర్ కాలనీలో జరిగిన అన్నదానంలో దాతలు, భక్తులు


వీరఘట్టం: ముచ్చర్ల వీధిలో అన్నదానం చేస్తున్న దృశ్యం


పాలకొండ: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు


పాలకొండ: కొండాపురంలో జరిగిన గణేశుని తిరువీధిలో ఆకట్టుకున్న బిందెల డ్యాన్స్

విద్యాబోధనలో భాషోపాధ్యాయుని పాత్ర కీలకం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు భాషా ఉపాధ్యాయులు

- ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి

సీతంపేట: విద్యాబోధనలో తెలుగు భాషోపాధ్యాయుని పాత్ర చాలా కీలకమని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి అన్నారు. సోమవారం స్థానిక బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నాణ్యమైన విద్యాబోధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న మెలకువలను తరగతి గదిలో పాటిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధనా పద్ధతుల్లో బోధన చేయాలన్నారు. అనంతరం పద్యబోధన, గద్యబోధన, వ్యాకరణాంశాలు, పాఠ్యప్రణాళిక, ప్రశ్నపత్రం తయారీపై డీఆర్‌పీలు ఎం.తాతయ్య, పి.కోటిబాబు, ఎ.కామేశ్వరరావు, గోపాలరావు, కూర్మాచార్యులు, కైలాశరావు, పట్నాయక్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మంగవేణి, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవి, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో గ్రీన్‌అంబాసిడర్లకు సన్మానం



తాడేపల్లిలో భామిని మండలంలోని కీసర గ్రామపంచాయతీ గ్రీన్‌అంబాసిడర్లు యడ్ల బిరసయ్య, తొంపల రామును రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గంధం చంద్రుడు, సఫాయి కర్మచారి ఆందోళన జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ సోమవారం ఘనంగా సన్మానించారు. స్వచ్ఛతా హి సేవా–2023 కార్యక్రమంలో భాగంగా వారు అందించిన ఉత్తమ సేవలకు గాను ఈ గౌరవం దక్కినట్లు కీసర పంచాయతీ కార్యదర్శి ఎం.మహేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ నేత వలరౌతు రామకృష్ణ తెలిపారు. –భామిని

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను జయప్రదం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన ఈ నెల 30వ తేదీ నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వం తరఫున ఉచిత వైద్యం అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబరు 4వ తేదీన జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా మళ్లీ కళావతినే గెలిపించుకుంటాం


ఎమ్మెల్యే కళావతికి మద్దతుగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

భామిని: ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతినే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. సోమవారం మండలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తక్షణమే స్పందించే మనసున్న నాయకురాలు కళావతమ్మేనని, ఆమెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పార్టీ పదవులు ఆశించే వారు తమకొద్దని, పార్టీ గెలుపు కోసం కృషి చేసిన వారే కావాలన్నారు.


వైద్యంతో నిలబెట్టారు..

- జీబీఎస్ వ్యాధిగ్రస్తురాలికి సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యం
- వారం రోజుల్లో కోలుకునేలా వైద్యసేవలు


కోలుకున్న పేషెంట్ నీలవేణితో వైద్యులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఓ మహిళకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందించారు. లేచి నిలబడేలా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పీఎల్‌దేవిపేటకు చెందిన జన్ని నీలవేణి గులియన్ బర్రే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి బారిన పడింది. నరాలు సరిగా పనిచేయకపోవడంతో రెండు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి లేవలేని స్థితికి చేరింది. ఆమెను కుటుంబ సభ్యులు సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఈనెల 19న చేర్పించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య బృందం ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందించింది. వారం రోజుల పాటు అందిన వైద్యంతో ఆమె పూర్తి స్థాయిలో కోలుకుంది. లేచి నిలబడి నడుస్తుండడంతో సోమవారం ఆమెను డిశ్చార్జ్‌చేశారు. విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సిన కేసును ఇక్కడే ఉంచి ట్రీట్‌మెంట్ ఇచ్చామని వైద్యవర్గాలు తెలిపాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే రూ.70వేల వరకు ఖర్చయ్యేదని పేర్కొన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులోకి వచ్చిన మెరుగైన వైద్యసదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరాయి.

రూ.5.5 కోట్లతో వీరఘట్టం రోడ్డు పనులు


తెలగవీధి మలుపు దగ్గర రక్షణ గోడ నిర్మాణ పనులు

వీరఘట్టం: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. దాదాపు రూ.5.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో ప్రస్తుతం తెలగవీధి మలుపు వద్ద రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరులోగా పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

'నా భూమి నా దేశం' ర్యాలీ

సీతంపేట: నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని, స్వాతంత్ర్య సమరయోధుల గొప్పతనం చాటుతూ ర్యాలీ కొనసాగించారు. దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 87 వినతులు


వినతిపత్రాలు సమర్పిస్తున్న వారితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి మొత్తం 87 వినతులు వచ్చాయి. కుట్టుమిషన్ ఇప్పించాలని లంగడుగూడకు చెందిన కూర్మారావు, చీపుర్ల యూనిట్ పెట్టుకోవడానికి రుణసాయం చేయాలని పెద్దోడుగూడకు చెందిన ఆనప, తాగునీటి సమస్య పరిష్కరించాలని జక్కర వీధికి చెందిన ధర్మరాజు, హౌసింగ్ బిల్లులు ఇప్పించాలని బీరపాడుకు చెందిన కల్యాణి, సాగుహక్కు పట్టా ఇప్పించాలని ముకుందాపురం రమేష్, అడంగల్ ఇవ్వాలని పెద్దరాజపురానికి చెందిన జగ్గయ్య, పింఛన్ మంజూరు చేయాలని జగ్గడుగూడకు చెందిన మంగయ్య కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఐటీడీఏ పీవో కల్పనాకుమారి వాటిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు కూడా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, పీఏవో హరికృష్ణ పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్


పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం

భామిని: వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ(వైఎస్సార్ సీపీ) గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన వారు పార్టీ బలోపేతానికి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పార్టీని నమ్ముకున్న వారికి పార్టీలో తప్పకుండా సముచిత గౌరవం లభిస్తుందన్నారు. పదవుల కోసం పనిచేయకూడదని, పార్టీ కోసం పనిచేయాలన్నారు. గతంలో ఏ రకమైన పదవులు లేకుండానే పార్టీని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నామని ఉదహరించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించడంతో పాటు గతంలో టీడీపీ చేసిన మోసాలను వివరించాలన్నారు. మనమంతా కలిసికట్టుగా పనిచేసి, 2024లో నూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, అలాగే మన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కూడా మళ్లీ గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఎంపీటీసీలు పాలక ఉషారాణి, బూస బాలకృష్ణ, సర్పంచ్‌లు మడపాన కేశవ, జామి ప్రభాకర్, బిడ్డిక గౌయింతి, పార్టీ నేతలు కిల్లారి పాల్గుణరావు, ఎరుకుమజ్జి పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే


సర్వే సిబ్బందితో సమావేశమై, సూచనలిస్తున్న తహసీల్దారు సోమేశ్వరరావు

పాలకొండ: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశమైన ఆయన ఇప్పటివరకు గ్రామాల్లో జరిగిన భూముల రీసర్వేపై సమీక్షించారు. ఈ క్రమంలో మండలంలోని అన్నవరం గ్రామ పరిధిలో జరిగే సర్వేలో వస్తున్న సమస్యలు చర్చకు రాగా, అక్కడి భూ హక్కుదారులు, సర్వే సిబ్బంది మధ్య సమన్వయం కుదిర్చారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని, పక్కాగా సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టే ఈ సర్వేను రైతులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలన్నారు. మండల సర్వేయర్ వెంకటరావు, డీటీ బుచ్చయ్య పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 83 మంది ఎంపిక


రోగుల కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ప్రగతి సేవా సొసైటీ, బడ్డుమాసంగి వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. మొత్తం 142 మందికి నేత్ర వైద్య తనిఖీలు చేయగా, శస్త్ర చికిత్సకు 83 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వీరందరికీ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నవజీవన్–తిరుపతి వారి ఆర్థిక సహకారంతో మంగళ, బుధవారాలు ఆపరేషన్లు చేయనున్నామన్నారు. అనంతరం కంటి పరీక్షల నిమిత్తం వచ్చిన వారందరికీ సత్యసాయి భక్తులు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల రికార్డుల పరిశీలన


రికార్డులను అప్‌డేట్ చేస్తున్న ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం పరిశీలించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మండలంలో చేపట్టిన పనులు, వేతనదారుల జాబ్‌కార్డులు, వారికి చెల్లించిన వేతనాలు, పెండింగ్ పనులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధి హామీ పనుల క్షేత్రస్థాయి సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం రికార్డులను అప్‌డేట్ చేశారు. సమావేశంలో ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆరా..

పాలకొండ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సోమవారం సమావేశమై, ఉపాధి పనులపై ఆరాతీశారు. ఉపాధి పనులకు సంబంధించి, రికార్డుల నిర్వహణ పక్కాగా చేపట్టాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పాఠశాల భవనాల రూఫ్ వాటర్ కిందపడి వృథాపోకుండా భూమిలో ఇంకిపోయేలా చేపడుతున్న పనులపై కూడా చర్చించారు. తొమ్మిది చోట్ల గ్రౌండింగ్ పూర్తయిందని, మరో మూడు చోట్ల గ్రౌండింగ్ పనులు చేపట్టాల్సి ఉందని ఏపీవోలు ఈశ్వరమ్మ, కృష్ణారావు తెలిపారు. త్వరితగతిన ఆ పనులు పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏవో డొంక త్రినాథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయించాలి

- గుమ్మలక్ష్మీపురం ఏడీఏ నిర్మలాజ్యోతి

గరుగుబిల్లి: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని గుమ్మలక్ష్మీపురం ఏడీఏ నిర్మలాజ్యోతి హెచ్చరించారు. సోమవారం మండలంలోని గిజబ గ్రామంలో ఉన్న లక్ష్మీ ఏజెన్సీ ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆమె ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. విక్రయిస్తున్న ఎరువుల వివరాలతో పాటు ఎరువు నిల్వల వివరాలను కూడా స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే ఈ–పాస్ మిషన్‌లో రైతుల వివరాలను నమోదు చేసిన తర్వాతనే ఎరువులు అమ్మాలన్నారు. ఎరువులు బాగాలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే మాత్రం ఏమాత్రం సహించేది లేదని, తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.